అంతర్గత రోడ్లకు మహర్దశ

- రూ.1.77 కోట్లతో 30 జీపీల్లో సీసీరోడ్ల నిర్మాణం
- మార్చిలోపు పనుల పూర్తికి గడువు


క్యాతన్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు

దామరగిద్ద: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాలలోని అంతర్గత రహదారులను సీసీరోడ్లుగా మార్చడానికి అధికార యంత్రాంగం నిధులు మంజూరు చేసింది. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో రూ.1.77 కోట్ల నిధులతో 39 సీసీ రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, క్రిమిటోరియం, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, మురుగునీటి కాల్వల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు జరుగుతుండగా, సీసీరోడ్ల నిర్మాణ పనులూ ప్రారంభమయ్యాయి. కాగా మార్చిలోపు రోడ్ల నిర్మాణం పూర్తిచేయాలని అధికారులు గడువు విధించారు. ఈ నేపథ్యంలోనే కొన్నిచోట్ల 50 శాతం పనులు పూర్తయ్యాయని చెబుతున్నారు. త్వరలోనే 100 శాతం పనులు పూర్తిచేస్తామని చెబుతున్నారు. మండలంలోని దామరగిద్ద, లోకూర్తి, వితలాపూర్, మద్దెల్‌బీడ్, క్యాతన్‌పల్లి, ఉల్లిగుండం, కాన్‌కుర్తి తదితర గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో రోడ్డు పొడవు ఆధారంగా రూ.2 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలోనే పనులు సాగుతున్నాయి. త్వరగా పనులు పూర్తిచేసి సీసీరోడ్లను అందుబాటులోకి తీసుకురావాలని, నాణ్యతతో నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరితగతిన పూర్తిచేయాలి

మండలంలోని దాదాపు ప్రతిగ్రామంలో సీసీరోడ్ల నిర్మాణ పనులకు అవసరమైన నిధులు మంజూరు అయ్యాయి. ఇప్పటివరకు 20కి పైగా రోడ్ల నిర్మాణం పనులు పూర్తి చేశారు. మిగిలిన రోడ్ల నిర్మాణం పనులు త్వరిత గతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రికార్డు చేసి పంపిస్తున్నాం. పనులు పూర్తి చేసిన వారికి మార్చి నెల అనంతరం బిల్లులు చెల్లిస్తాం

–నర్సింగ్ రావ్, పీఆర్ ఏఈ, దామరగిద్ద

క్లుప్తంగా

బహుమతులు ప్రదానం



మక్తల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మక్తల్: పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జీసీడీఓ పద్మనళిని అన్నారు. కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఏసీజీఈ రాజేందర్, డీసీఈబీ వెంకట్‌రాములు, హెచ్ఎం రఘువీర్, నరేష్, జంగయ్య, రూప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



మాగనూర్: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. స్థానిక ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మాగనూర్ మండల కేంద్రానికి చెందిన బొంబాయి మహేష్ రాత్రి సమయంలో మాగనూర్ పెద్ద వాగు నుంచి అక్రమంగా కొత్తపల్లి గ్రామానికి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి సెక్టర్ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాగనూర్ ఎస్‌ఐ నరేందర్ తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడ్డాడు. దీంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి యాజమానిపై కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ధ్వంసమైన మురుగు కాల్వ



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న మురుగు కాల్వ ఇసుక టిప్పర్ల కారణంగా ధ్వంసమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ అనుమతులతో వర్కూర్ గ్రామ శివారులో ఇసుక రీచ్‌లు నడుస్తున్నాయి. అయితే ప్రతిరోజు గ్రామం లోపలి నుంచే ఇసుక టిప్పర్లు నడుస్తుంటాయి. గురువారం ప్రధాన రహదారి వెంబడి ఓ ఇంట్లో పంక్షన్ ఉండటంతో వారు స్థలం కొరత కారణంగా టెంట్‌ను రోడ్డు పై వేశారు. దీంతో అలాగే వచ్చిన టిప్పర్ డ్రైవర్ మురుగు కాల్వను ఢీకొనడంతో కొంతమేర ధ్వంసమైంది. టిప్పర్లతో నిత్యం ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాటిని గ్రామం వెలుపలి నుంచి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



మరికల్: మండల కేంద్రంలోని వెంకటసాయి ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా స్వపరి పాలన దినోత్సవం నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు వినతి

ధన్వాడ: నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం అమలు చేసి పేట జిల్లా రైతులకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని జిల్లా జలసాధన సమితి కో కన్వీనర్ నర్సింహ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. నారాయణపేట వెళ్తున్న ఈటల ధన్వాడలో కొద్ది సేపు ఆగారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను సన్మానించారు.

విద్యార్థులు పరీక్షలలో సత్తాచాటాలి


విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మాగనూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు తనవంతు సాయం అందిస్తున్నానని అన్నారు. విద్యార్థులు పరీక్షలలో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిములు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం : కేసునమోదు

మాగనూర్: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైన ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు యువతి నెల 6 తెల్లవారుజామున ఇంట్లో అందరు పడుకున్న సమయంలో బయటకు వెళ్లింది. ఆమె తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతకగా ఆచూకీ లభించలేదు. అయితే ఆమెను శివారులో ఎవరో కారులో తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తమకు సమాచారం ఇచ్చినట్లు బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. విషయంలో వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పామపురం గ్రామానికి చెందిన యువకుడిపై అనుమానం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

స్వీపర్ల వేతనాలు పెంచాలి

మరికల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల వేతనాలను వెంటనే పెంచాలని ఆ సంఘం మండల అధ్యక్షులు నర్సిములు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. రూ. 150 వేతనంతో పని చేస్తున్న తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నెలకు ఇస్తున్న వేతనం రూ. 4 వేలు మాత్రమే కావడంతో కుటుంబ పోషణకు భారంగా మారిందన్నారు. స్వీపర్ల సమస్యలను దృష్టిలో ఉంచుకొని నెలకు రూ. 20 వేలు ఇవ్వాలన్నారు.

‘పనిచేసే వారికి పట్టం కట్టండి’


ప్రచారం చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : పాఠశాల ఉపాధ్యాయులతో సమాంతరంగా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు దామరగిద్ద, ధన్వాడ, మరికల్ కేజీబీవీలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రంగారెడ్డి, నాయకులు జనార్దన్ రెడ్డి, రఘువీర్, మొల్గాన్‌జనార్దన్, శశిరేఖ, వాణిశ్రీ, అనిత, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, రవికుమార్ పాల్గొన్నారు.

కోస్గి: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పని చేసే ఉపాధ్యాయ సంఘానికి పట్టం కట్టాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నాచారం కేజీబీవీ పాఠశాలల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం కేశవరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. సంఘం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, నాయకులు రమేష్, మధుసూదన్, ప్రకాష్, అనంతయ్య, నర్సిములు, వెంకట్‌రెడ్డితోపాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దూరు: పీఆర్‌టీయూ టీఎస్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎన్నికల పరిశీలకులు శ్రీనివాసరావ్, శంకర్‌లు మండలంలోని పెదిరిపాడ్ కేజీబీవీ, దోరేపల్లి ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు శ్రీనివాస్, సంతోష్, వెంకట్ రెడ్డి, మోహనాచారీ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మరికల్: బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కూలీలకు వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అరుణ్‌కుమార్, రాజేశ్వర్‌రెడ్డిలు అన్నారు. మరికల్‌లో గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వెయ్యి బీడీలకు గాను కూలీ రూ. 300, అదేవిధంగా బీడీ ప్యాకర్స్, నెలసరి ఉద్యోగులు, రింగ్ బీడీ కార్మికులకు 40 శాతం వేతనాలు పెంచాలని కోరారు. బీడీలు చేస్తూ ప్రమాదకరమైన క్యాన్సర్ బారిన పడుతూ చాలామంది మృత్యువాత పడుతున్నారని, అలాంటి వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేపడుతామన్నారు.

వరిపంటకు తెగుళ్లు



మరికల్: యాసంగిలో సాగు చేసిన వరి పంటలకు ఎర్ర తెగుళ్లు సోకుతున్నాయి. రైతులు అనేక తెగుళ్ల నివారణకు రకరకాల మందులు వాడుతున్నా ప్రయోజనం లేకుండా పోతోందని వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరుతున్నారు. లేనిచో పంటల కోసం పెట్టిన పెట్టుబడులు రాక నష్టపోయే పరిస్థితి ఉందని వాపోతున్నారు.

గోవా మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లతో అధికారులు

మాగనూర్(కృష్ణ): గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. కృష్ణ మండలంలోని రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు దగ్గర గురువారం విస్తృతంగా నిర్వహిస్తున్న తనిఖీలో 27 మద్యం బాటిళ్లను గుర్తించినట్లు ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు రంగనాథ్‌రెడ్డి, కవిత తెలిపారు. మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు మల్లన్నగౌడ్, సయ్యద్ భాష, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బెంచీల వితరణ



మక్తల్: జౌళ్లపూర్‌లో గురువారం సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనర్సింహరెడ్డిలు తమ సొంత ఖర్చులతో 20 డెస్క్ బెంచీలను పాఠశాలకు వితరణ చేశారు. హెచ్ఎం వెంకటేశ్వర్‌గౌడ్, ఉపాధ్యయుడు రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు: నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రాష్ట్ర ప్రజలను నిండా ముంచారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, రెయిన్‌బో హోటల్ అధినేత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి మొదటి ప్రధాన్య ఓటు వేసి గెలిపించాలని గురువారం ఆత్మకూర్‌లోని పలు పాఠశాల్లో కాంగ్రెస్ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ఉద్యోగాలు లేక యువత హోటళ్లలో సర్వర్లుగా, క్యాటరింగ్ బాయ్స్‌గా పనిచేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబానికి మాత్రమే లబ్ధి చేకూరిందని ఆరోపించారు. 20ఏళ్ల క్రితం ఉస్మానియా యూనివర్శిటీతో పాటు అన్ని ప్రభుత్వ విద్యాలయాలు ఏవిధంగా ఉన్నాయో ప్రస్తుతం కూడా అదేవిధంగా దీన పరిస్థితుల్లో ఉన్నాయని విమర్శించారు. అధికార మదంతో కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ ఉపాధ్యాయులు రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయాబ్‌ఖాన్, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, రహమతుల్లా, గణేష్, భగవంత్, శ్రీను, విష్ణు, బుచ్చన్న, హరీష్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

అమరచింత: మహిళలపై జరుగుతున్న దాడులను నివారించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల అన్నారు. ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలు కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు, మనువాద దాడికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో మహిళలపై ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక దోపిడి కొనసాగుతుందన్నారు.

‘సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం’


చెన్నారంలో మాట్లాడుతున్న నాయకులు

కోస్గి: సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ‘హాథ్ సే హాథ్ జోడో యాత్ర’ గురువారం మండల పరిధిలోని చెన్నారంలో కొనసాగిన సందర్భంగా మాట్లాడారు. కోట్లాది రూపాయలు అప్పులు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పాలనలో పూర్తిగా విఫలమయ్యాయని టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్ కుమార్ అన్నారు. మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు


శిబిరం ప్రారంభిస్తున్న డాక్టర్ రాఘవేంద్రరెడ్డి

మాగనూర్: మండల పరిధిలోని నేరడగంలో ఉన్న శ్రీ పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠంలో మాగనూర్ మండల వైద్యాధికారి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరంన ఏర్పాటు చేశారు. గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటుగా జరిగే జాతర మహోత్సవం సందర్భంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ..ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున జాతరకు వచ్చే భక్తుల కోసం ముందు జాగ్రత్త చర్యగా జనరల్ మందులను అందుబాటులో ఉంచామని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మఠాధిపతి శ్రీపంచమ సిద్ధలింగమహాస్వాములు, సర్పంచ్ అశోక్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ వితరణ


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బిల్డర్ తాయప్ప

మాగనూర్: మండల పరిధిలోని ఉజ్జెల్లి మండల ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన బిల్డర్ తాయప్ప రూ. 70 వేలు విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. ఈ మేరకు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింగప్ప, మాజీ సర్పంచ్ రాజు, ఉపాధ్యాయులు మహేష్, భవ్యశ్రీ, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ

మాగనూర్: మండల కేంద్రంలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపీపీ శ్యామలమ్మ పరిశీలించారు. మాగనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపం నుంచి పాత ఖాన్‌దొడ్డి రోడ్డుకు ఇరువైపుల ముళ్లపొదలను తొలగిస్తున్న కూలీలతో మాట్లాడారు. కనీసం ఫీల్డ్‌అసిస్టెంట్, సంబంధిత ఏపీఓ లేకుండానే పనులు జరుగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇష్టానుసారంగా పనులు చేయించడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

‘విద్యావంతులనే మండలికి పంపించాలి’


ప్రచారం చేస్తున్న రెడ్డప్ప

నారాయణపేట రూరల్ : మేధావులతోనే చట్ట సభలకు గౌరవం పెరుగుతుందని విద్యావంతుడైన జేఏన్‌టీయూ రిటైర్డ్ ప్రిన్సిపాల్ వినయ్‌బాబును మండలికి పంపించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప కోరారు. గురువారం పట్టణంలోని మైనార్టీ, ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో రామకృష్ణ, గజలప్ప, నవీన్ పాల్గొన్నారు.

మక్తల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రొఫసర్ వినయ్‌బాబును గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి అన్నారు. గురువారం మక్తల్‌లో ప్రచారం నిర్వహించారు. జగదీష్, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతామని తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి అన్నారు. గురువారం ఊట్కూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప, నాయకులు జగదీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ప్రభోత్సవం


ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాగనూర్: మండలంలోని నేరడగం గ్రామంలోని పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠం జాతరలో భాగంగా గురువారం సాయంత్రం 7 గంటలకు ప్రభోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తికి పంచమ సిద్ధలింగ మహాస్వాములు పూజలు నిర్వహించిన అనంతరం ప్రభోత్సవం చేట్టారు. శుక్రవారం సాయంత్రం మహా రథోత్సవం, అనంతరం ధార్మిక ప్రవచనం, తులాబారం కార్యక్రమాలు నిర్వహించనున్నారు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న శిక్షకుల

నర్వ: యోగా మహోత్సవాన్ని పురస్కరించుకొని హరదిల్ ధ్యాన్, హర్‌దిన్ ధ్యాన్ అనే కార్యక్రమాన్ని కాల్వాల్‌లో గురువారం చేపట్టారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో మూడు రోజుల పాటు సాయంత్రం 6:30 గంటలకు యోగా మహోత్సవం కార్యక్రమాలు చేపడుతున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. అందులో భాగంగా గురువారం సాయంత్రం స్థానిక బ్రహ్మంగారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ధ్యానం వల్ల భౌతిక, ఆధ్యాత్మికప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికివేత: కేసు నమోదు


కంసాన్ పల్లిలో నరికివేసిన చెట్లు

దామరగిద్ద: అక్రమంగా చెట్లు నరికిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి జాకీర్ తెలిపారు. మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో రైతులు అనుమతి లేకుండా తమ పొలంలోని నారెపు చెట్లు నరకడంపై గ్రామ ఉప సర్పంచ్ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారని తెలిపారు. తమ దాయాదులు గోవింద్‌కు తమ పొలం మధ్యలో గల నారెపు చెట్లను ఎలాంటి అనుమతి లేకుండా చెన్నరెడ్డిపల్లికి చెందిన అంజప్పకు విక్రయించి చెట్లను నరికివేసినట్లు ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసి విచారణ దర్యాప్తు చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.